# కథ చెబుతా రాసుకో

"ఎందుకు ఆ పిచ్చి కథలు రాయడం. అవేమైనా కూడూ గుడ్డా పెడతాయా. మాయదారి మేళం" అంటుంటారు కథలు రాసేవాళ్లని. కథలు రాసే వాళ్ళ మీద మంచి జోకులు పేలుస్తుంటారు కూడా. "ఏమండోయ్ ఇతను కథలు రాస్తుంటాడు. మన మధ్యలో ఇతను వుండగా ఏ విషయాలు మాట్లాడుకోరాదు. రాత్రికి ఆ విషయాన్ని కథగా రాసేసి పత్రికకు పంపేస్తాడు." అని అంటుంటారు. అలాంటి రచయితల్లో మూర్తి ఒకడు.

అడపా దడపా పత్రికల నుండి గోడకు కొట్టిన బంతిలా తిరిగొస్తున్న కథలు మూర్తి బుర్రకాయ మీద సమ్మెట దెబ్బలు బాదుతున్నా రచనలు చేస్తూనే వున్నాడు. ప్రాచీన కాలం నుండి రచయితల భార్యలు తమ భర్తల పిచ్చి రాతలు మెచ్చుకోరని నానుడి. ఆ విధంగానే మూర్తి ధర్మపత్ని కూడా పత్రికల నుండి రచనలు తిరిగొచ్చినప్పుడు భయంకరమైన చిత్రహింస వంటి మాటల విసుర్లతో పొడిచినా పోనీ ఎప్పుడైనా ఖర్మగాలి బహుమతి వస్తే ఆ రేంజ్‌లో ప్రశంసించక పోవడం మూర్తి రచనా వ్యాసంగంలో చెప్పుకోదగ్గ ప్రత్యేక అంశం...

అయితే ఇక్కడో చిన్న ప్లస్ పాయింట్ ఉంది. "ఎప్పుడైనా లక్ష రూపాయల బహుమతి వచ్చే రచన రాసి గెలవండి, అప్పుడు మిమ్మల్ని రచయితగా గుర్తిస్తాను" అంటుంది అతని శ్రీమతి. మరి ఇది సాధ్యమేనా?

అతని ఈ చీకటి జీవితంలో ఒక చిరుదివ్వె. మూర్తిపై ఎంతో ప్రేమాభిమానాలు కురిపించే అతని అక్కయ్యకు అతను రాసే కథలంటే కూడా అంతే ఇష్టం. కాని ఆ ఇష్టంతోనే పెద్ద కష్టం వచ్చిపడింది. సుఖం వెనకాలే దుఃఖం వున్నట్లుగా ఇది భరించాలి మరి తప్పదు.

ఒక రోజు సెల్ రింగయింది. "హలో నేను రా తమ్ముడూ. నీకు చక్కని రెండు ప్లాట్స్ చెబుతాను. కథలు రాసి నాకు చెప్పు. నోట్ బుక్ తెచ్చుకో" అంది. వెంటనే తెచ్చుకున్నాడు. "ఇదిగో విను, మొదటి ప్లాటు. పిల్లి పిల్లల్ని పెట్టి ఏడిళ్ళు తిప్పుతుంది కదా. నీకు తెలుసునా? ఈ విషయాన్ని మనిషి జీవితానికి అన్వయించి కథ రాసుకో. ఇక రెండో ప్లాటు, నువ్వు చూసేవుంటావు చీమలు ఎప్పుడూ చాలా బిజీగా తిరుగుతూ వుంటాయి. అసలు విశ్రాంతి తీసుకోవడం అంటే నిద్రపోవడం మనం ఎప్పుడూ

చూడలేదు. ఈ విషయం మీద దీనిని మానవ జీవితానికి ముడిపెట్టి కథ రాయి. అయినా ఒరేయ్ తమ్ముడూ! రచయిత అనేవాడు ఎప్పుడూ జేబులో నోట్‌బుక్, పెన్నూ పెట్టుకుని సమాజాన్ని, మనుషుల్ని పరిశీలిస్తుండాలి రా. నువ్వు వెంటనే ఈ పని చెయ్". అనేసి సెల్ ఆఫ్ చేసింది.

హతవిధీ! రచయిత అనబడే వాడు ఎంత లోకువైపోయాడు నీకు అనుకున్నాడు మూర్తి. పిల్లి పిల్లల్ని పెట్టి ఏడు ఇళ్ళు తిప్పితే దీని మీద కథ రాయనా? ఖర్మ! మనిషి కూడా పిల్లల్ని ఏడు ఇళ్ళు తిప్పాలా లేక తిప్పే రోజులు వస్తాయా? ఇక చీమలు అవిశ్రాంతంగా ఎప్పుడూ బిజీగా తిరగడం గురించి ప్రత్యేకంగా కథలు రాయవలసిన అవసరం లేదు. ఎందుకంటే ఎక్కడో చాలా తక్కువ మంది తప్పితే చీమ అంత బిజీ కాదు గాని, ఎంతో కొంత బిజీగానే వుండి కష్టపడి తీరాలి. లేకపోతే అతని మనుగడ కష్టం కదా?

ఇంకోరోజు రాత్రి పది గంటలకు అక్క ఫోన్ "నాకు ఇప్పుడే ఒక బ్రహ్మాండమైన ఆలోచన వచ్చిందిరా. నువ్వు ఈ మధ్యన ఒక పత్రికలో రాసిన కొత్తకోణం కథలో దూరప్రాంతంలో పనిచేసే ఏకైక కొడుకు అక్కడ ఇంటర్‌కాస్ట్ మ్యారేజ్ చేసుకుని వస్తే ఒక్కడే కొడుకు గదా అని ఏమీ అనకుండా స్వాగతిస్తారు. ఇది ఎందుకు చెబుతున్నానంటే నీక్కూడా ఒక్కడే కొడుకు గదా వాడు విదేశాలలో ఏం ముగ్గులు పెడుతున్నాడో కాస్త కన్నేసి వుంచు. నువ్వు ఈ పాయింట్‌ని రివర్స్‌లో కథ రాసేవనుకో బలేగా వుంటుంది" అంది.

ఒక రచయిత కథలో భార్య భర్తను రాచిరంపాన పెడుతుంటే విసిగి వేసారి చివరకు ఒక నడిజామున గొడ్డలితో నరికి పోలీస్ స్టేషన్‌కు రక్తపు మరకలు వున్న గొడ్డలితో వెళ్ళి నన్ను అరెస్ట్ చెయ్యండి, నా భర్త పీడ నేనే వదిలించుకున్నాను" అని వ్రాస్తే దానికి బహుమతి వచ్చిందనుకోండి. మరి రియాల్టీలో తన రచనా వ్యాసంగంతో ఆమెను విసిగిస్తున్నందున తనను అలా చేస్తుందేమోనని రచయిత ఆలోచించాడే అనుకోండి వాడి గుండె గండిపేట చెరువైపోదూ.

మూర్తికి అక్క చెప్పిన విషయం విన్నాక కొడుకు గురించి బెంగ పట్టుకుంది. రాత్రి పదిన్నర ప్రాంతంలో యు.ఎస్. నుండి కొడుకు ఫోన్ చేస్తే తల్లి మాట్లాడుతున్నది. వెంటనే భార్య దగ్గరగా వెళ్ళి చెవిలో "ఆడపిల్లలతో క్లోజ్‌గా వుండొద్దని చెప్పు" అన్నాడు. "చాల్లెండి వాడికి అసలే సిగ్గు ఎవరితోనూ మాట్లాడనే మాట్లాడడు. ఏమిటీ మీ అక్కగాని ఫోన్ చేసి మళ్ళీ ఏదైనా దరిద్రపు ఆలోచన చెప్పిందా ఏమిటి?" అంటూ మూర్తి మీద విరుచుకుపడింది. చివరకు అక్క చెప్పే ఆలోచనలతో అతనిలోని రచయిత చచ్చూరుకునేట్టున్నాడు అనుకున్నాడు.

ఒకసారి మూర్తి తన అక్క ఇంటికి వెళ్లాడు, వాళ్ల ఇంటి పక్కనే ఒక యువదంపతులు వున్నారు. ఆ రోజు ఉదయమే ఆ యువకుడు తన మూడు సంవత్సరాల బాబు కాక్కెళ్లే కడుగుతున్నాడు. భార్య ఈజీ ఛైర్‌లో కూర్చుని వీక్లీ చదువుకుంటోంది, టిప్ టాప్‌గా తయారైంది. రేపు తన కొడుకు పెళ్ళయ్యాక ఇలాంటివి ఎన్ని చెయ్యాలో అని ఆలోచిస్తున్న మూర్తి పక్కనే వున్న అతని అక్క "ఉశావా మంచి ప్లాటు, దీని మీద మంచి కథ రాసుకో" అంది.

అదేదో సినిమాలో ప్రేమ ఫలించని హీరో పాత ప్రియురాలు కనిపిస్తే అతడ్ని అనేక రకాలుగా తిడుతుంటే అతను ఉద్రేకంతో ఆమె పేరును అనేకసార్లు తక్కువ సౌండ్ రేంజ్ నుండి అతి ఎక్కువ సౌండ్ రేంజ్ వరకూ అరుస్తాడు. అలా అరవాలని పించింది మూర్తికి. తాను కథలు రాయడం పెద్ద చిక్కొచ్చిపడింది.

ఇలా రోజులు గడుస్తుండగా, ఒక రోజు మూర్తి బైక్ మీద వెళ్తుంటే పోస్ట్‌మెన్ ఎదురొచ్చి "ఇదిగో సార్ మీ పోస్ట్" అంటూ పది ఉత్తరాలు ఇచ్చాడు. అందులో తిరిగొచ్చిన కథల కవర్లు ఎనిమిది, పారితోషికం పంపిన చెక్కు కవరు ఒకటి, ఒక ఉత్తరం వున్నాయి. సామాన్యంగా తిరిగొచ్చిన కవరు చూడగానే మూర్తికి ఫెడేల్ మని చెంపదెబ్బ కొట్టినంత పనవుతుంది. అతను ఆ స్థితిలో వుండగా-

"సార్ ఎందుకలా డబ్బులు పాడుచేస్తారు? ఆ తిరిగొచ్చిన కవర్లకు నూటఇరవై రూపాయలు పోస్టేజీ కాగా, మీకు పత్రిక నుండి వచ్చిన పారితోషికం తాలూకు చెక్కు విలువ తిరిగొచ్చిన కవర్లను అయిన ఖర్చు చెల్లు అవుతుందేమో" అని అతను అనగానే అసలే ఇంటి దగ్గర భార్య ఎందుకు డబ్బులు పాడుచేస్తారు వెధవ కథల కోసం పోస్టేజికి బోల్డు డబ్బు ఖర్చుపెడుతున్నారు. ఏదో ఖర్చులకి వస్తాయికదా-" అంటూ నసపెడుతూంటే వీడొకడు ఎక్స్‌ట్రాగాడు అనుకుని "నీ పని చూసుకో. చూడు నువ్వు అర్జంటుగా సిగరెట్స్ కాల్చడం మానెయ్ లేకపోతే నీ చేతిలో వున్న టపా అంతా ఆ మసి పడి తగలబడే ప్రమాదం వుంది" అన్నాడు.

"అదేటండీ బాబూ పదో తరగతి నుండీ నాకు సిగరెట్ అలవాటండీ. ఇది మానడం చాలా కష్టం సుమండీ" అన్నాడు. "మరి ఇదీ అంతే" అన్నాడు అతని చేతిలో కవర్లు చూపించి. అతను నోట్లో బిరడా పెట్టినట్లుగా నోరు మూసుకుని చెప్పాపెట్టకుండా, అప్పిచ్చినవాడు కనుపిస్తే బాకీ వున్నవాడు పారిపోయినట్లుగా జారుకున్నాడు.

ఇంతలో ఇద్దరమ్మాయిలు అటుగా వెళ్తున్నారు. ఇక అమ్మాయి మరో అమ్మాయితో మూర్తిని చూపించి మొన్న 'దీపం' పత్రికలో దరిద్రమైన శృంగార కథ రాసేదు ఆయనే. చూడు ముఖం ఎలావుందో, మరి ఇంట్లో పెళ్ళాంతో ఎలా వుంటాడో. మూడొంతులు వీడిని పెళ్లాం దగ్గరికి రానీయదేమో. అందుకే కథల్లో మరీ ఓవర్

అయిపోతుంటాడు" అంటోంది... "అవును బలే చెప్పేవే. వాడి ముఖానికి శృంగారం కూడానా, చూడు బట్టతలేసుకుని నక్కలా ఎలాగున్నాడో-" అని మరో అమ్మాయి అంటూంటే, ఆ మాటలు వినపడనే వినపడ్డాయి మూర్తికి.

ఉన్నపళంగా సీతాదేవిని తన ఒడిలోకి లాక్కోడానికి భూమాత చీలిపోయినట్టుగా తాను నిల్చున్న చోట భూమి పగిలితే క్షణంలో తను భూమిలోకి దిగబడితే ఎంత బావుందును, అనిపించింది మూర్తికి. అక్కడికీ శృంగార కథలు రాయకూడదనుకున్నాడు, కాని ఎవరో "నవరసాలు రాస్తేనే రచయితండీ మూర్తిగారూ! రాయండి" అని చెప్పిచచ్చారు. తీరా చేసి రాస్తే అది వెంటనే ప్రచురించేశారు. అది పత్రికలో వచ్చిన రోజు నుండి పది రోజులు పెళ్ళాం బెడ్ కట్ చేసింది, పైగా పదిమందీ తనను వేలెత్తి చూపించారు. ఇప్పుడేమో ఈ అమ్మాయిలు. ఛీ మాయదారి సంత అనుకుని బైక్ మీద వేగంగా మాయమైపోయాడు.

కొన్ని రోజుల తరువాత, ఒక పత్రికలో నవలకు లక్ష రూపాయల బహుమతి ప్రకటించారు. మూర్తి పగలూ రాత్రీ కష్టపడి ఒక నవలారాజాన్ని రాసేసి పంపించేశాడు. నవల రాస్తుంటే "మీ ముఖానికి నవలొకటీ దానికి కాగితాలు, పోస్టేజీ, కొరియర్ చార్జీలు దండగ. చాల్లెండి సంబడం" అంది అతని భార్య. "నవ్వీన నాపచేనే పండుతుందే. చూడు నేను ఈ సారి లక్ష రూపాయల బహుమతి గెలుస్తాను" అని పంతం కొద్దీ నవల రాసేడు.

నవల పంపిన తేదీ నుండి దానికోసమే ఎదురుచూస్తూ కూర్చున్నాడు. రోజూ ఆఫీసు నుండి ఇంటికి రావడం "ఏమోయ్ పోస్టు వచ్చిందా. ఒక వేళ నవల గురించి పత్రిక వాళ్ళు ఫోన్ చేస్తే, జాగ్రత్తగా మాట్లాడు, నేను తరువాత చేస్తానని చెప్పూ" అన్నాడు. "ఎందుకు ఫోన్ చేస్తారు. తిప్పి పంపడానికి ఫోను ఎందుకు?" అంది. మూర్తికి కోపం వచ్చి తన తల గోడకేసి కొట్టుకోబోయి తలనొప్పి పుడుతుందని గుర్తుకువచ్చి ఆ ప్రయత్నం మానుకుని "అయితే నా నవల తిరిగొచ్చేస్తుందని డిసైడయిపోయావా?" అన్నాడు. "మీ సరుకు నాకు తెలుసు కదా" అంది. మూడ్ లేదన్న భర్తను పౌర్ణమి నాటి రాత్రి బెడ్ మీద మూడ్‌లో భార్య ఎగతాళి చేసినట్లుగా.

మర్నాడు మూర్తి ఆఫీసు నుండి ఇంటికి వచ్చేసరికి ఏభై రూపాయల స్టాంపులున్న కవరులో అతని నవలారాజం తిరిగి వచ్చింది. ఆ మధ్యన ఎవరో అన్నారు, పోటీకి వచ్చిన నవలలన్నీ చదవనేచదవరనీ పేరు ప్రఖ్యాతులను బట్టి బహుమతి ఇచ్చేస్తారని, అందుకని ప్రతి ఏభై పేజీలకు పిన్ కొట్టాడు. పిన్నులు విప్పివుంటే చదివినట్లు లేక పోతే వాళ్ళు చెప్పింది నిజమే అనుకుంటూ కవరు విప్పాడు. అందులో సంపాదకుల సంతకంతో ఒక ఉత్తరం వుంది.

మూర్తి గారికి,

"నమస్కారం. మీరు పోటీకి పంపిన నవల ప్రాధమిక పరిశీలనలో మా సంపాదకవర్గంలోని సభ్యులు మొదటి ఏభై పేజీల వరకైనా చదవడం అసాధ్యమైంది. ఇలా నవల రచించడం మీకే సాధ్యమైంది. అభినందనలు. అందువలన మీరు పిన్ చేసిన పిన్నులు విప్పలేదు. ఈ సారి మరో మంచి నవల చదివించేది రాసి పంపండి.

మా పత్రికకు మీరు నవల పంపినందుకు కృతజ్ఞతలు. ఎడిటర్"

"అయిందా. నేను చెబుతూనే వున్నాను. డబ్బుతగలేశారు. ఇక ఆపండి పిచ్చిరాతలు" అంటూంటే భార్య ముందు,దానకర్ణుడు బలిచక్రవర్తి, వామనుడు మూడోకాలు ఎక్కడ పెట్టమంటావయ్యా అంటుంటే నా తల మీద పెట్టండి స్వామీ అన్నట్లుగా శిరసు వంచి ఆమెకు దణ్ణం పెట్టి – "ఏమే దయచేసి నన్ను ఇక బాధ పెట్టకే. నేను రాయడం మానేస్తాను" అన్నాడు మూర్తి.

ఇంతలో మూర్తి అక్క ఏదో పెళ్ళి వుందని అనుకోకుండా వచ్చింది. వస్తూనే ఆటో దిగుతూంటే, గుమ్మంలో నుంచున్న మూర్తి అప్పటి దాకా నవల తిరిగి రావడం వలన షాక్ ట్రీట్ మెంట్‌కి గురి కావడం వలన కొంచెం రిలీఫ్ ఫీలై–

"రావే. అక్కయ్యా చాలా రోజులకు వచ్చావు" అని సంతోషంగా అంటున్న సమయంలో ఒక సంఘటన జరిగింది. ఇంటి ముందునుండి రెండు పెద్ద పందులు వాటి సంతానం చెరి డజను పంది పిల్లలతో కులాసాగా తోకలు ఊపుకుంటూ వెళ్తున్నాయి. అది చూసి మూర్తి అక్క–

"నిజమేరోయ్ తమ్ముడూ. వయసులో వున్నప్పుడు పంది పిల్ల కూడా అందంగానే వుంటుందని పెద్దలు అంటుంటారు చూశావా. పంది పిల్ల ముండలు ఎంత ముద్దొస్తున్నాయో". అంటూంటే, మరు క్షణంలో మూర్తి చకచకా లోపలకు పరుగెత్తికెళ్ళి తన శ్రీమతితో "మా అక్క వచ్చింది చూడు. నేను డాబా మీదకు వెళ్తున్నాను. నాకు విపరీతంగా తలనొప్పిగా వుంది" అని డాబా ఎక్కుతుంటే "ఇప్పుడు ఈవిడ నాకు తలనొప్పి తెస్తుంది దేశంలో జరిగే సోదంతా చెప్పి" అనుకుంటూండగా మూర్తి డాబా మీదకు చేరి నిద్ర నటించసాగేడు. లేకపోతే ఆ రెండు పందులూ ప్లస్ రెండూ ఇంటూ పన్నెండూ మంది పిల్ల ముండలనూ మానవ జీవితానికి అన్వయించి కథ రాయమంటుంది తప్పనిసరిగా అని భయపడి చచ్చాడు మూర్తి.

ఇంత జరిగినా మూర్తి ఇంకా రచనలు చేస్తూనే వున్నాడు. ●

(స్మైల్ ప్లీజ్ నవ్వండి, మాసపత్రిక, జులై 2010)